క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని మహ్మదాపురం పంచాయతీ రాజుగారిపల్లిలో సోమవారం సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు స్వామిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు అమ్మఒడి లాంటివి


ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ పద్మజ

పామూరు: అంగన్‌వాడీ కేంద్రాలు అమ్మఒడి లాంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. స్థానిక డీవీపాలెం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో సోమవారం అంగన్‌వాడీ పిలుస్తోంది నిర్వహించారు. గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సంతానం కలుగుతారన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

తహసీల్దార్‌గా వాసుదేవ రావు బాధ్యతల స్వీకరణ

పామూరు: తహసీల్దార్‌గా ఆర్.వాసుదేవరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రైతులు భూసమస్యలు ఉంటే కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. నాగులుప్పలపాడు డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై పామూరు తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది బొకే అందజేసి అభినందనలు తెలిపారు.

90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలి

కొండపి: రైతులకు 90 శాతం సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు అందించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు కౌలు రైతులు ఇబ్బంది పడకుండా కూటమి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పి.మురళికి వినతిపత్రం అందజేశారు. ఆర్.లక్ష్మీ, సాయి, బ్రహ్మయ్య, రోశయ్య, నాగభూషణం, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడి చేసిన నిందితుడు అరెస్టు

సింగరాయకొండ: మద్యం మత్తులో దాడికి పాల్పడిన నిందితుడు రాయపాటి మహేష్‌ను సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. ఇటీవల పాకల రోడ్డు సమీపంలో మద్యం మత్తులో ఆలూరి శివపై దాడి చేసి గాయపరచిన ఘటనలో శివ ఫిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మద్యం తాగి గొడవలు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని మందుబాబులను హెచ్చరించారు.

ఉద్యోగులు జవాబుదారీతనంగా పనిచేయాలి

కనిగిరిరూరల్: మున్సిపల్, సచివాలయ ఉద్యోగుల, సిబ్బంది జవాబుదారితనంగా పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ ఆఫీసులో సోమవారం మున్సిపల్, సచివాలయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో నీటి, విద్యుత్, డ్రైనేజీ, పారిశుద్ధ్యం సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి తక్షణం పరిష్కరించాలన్నారు. మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలన్నారు. డీఈ శ్రీరాం మూర్తి, ఏఈ మాధవ్‌రావు, మున్సిపల్, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో పతకాలు

కందుకూరు: ఒరిస్సా రాష్ట్రంలోని కటక్‌లో గత నెల 28 నుంచి ఈనెల 1వ తేదీ వరకు జరిగిన 8వ ఓపెన్ తైక్వాండో నేషనల్ చాంపియన్‌షిప్‌లో కందుకూరు చెందిన పలువురు క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించినట్లు తైక్వాండో ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎస్కే అబ్దుల్‌సలాం తెలిపారు. పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రకాశం జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ అభినందించారు. బాలికల విభాగంలో బి.లక్ష్మీ అక్షర, సి.లక్ష్మీప్రియలు బంగారు పతకం సాధించగా, బాలుర విభాగంలో ఎ మన్విత్‌రాజ్, జి.త్రినాథ్‌లు బంగారు పతకం , టి.ఉత్తం ప్రేమ్ సాత్విక్, పి. సాయిశ్రీ వాత్సవ్‌లు రజతపతకం, సి.మోహిత్ కేసరి నందన్ కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను, టీం కోచ్ అఖిల్‌ను జేసీ గోపాలకృష్ణ, డీఎస్‌డీఓ రాజరాజేశ్వరి, జిల్లా తైక్వాండో అధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, జిల్లా కార్యదర్శి అబ్దుల్ సలాంలు అభినందించారు.

పేదల చదువులకు కూటమి గ్రహణం

నాడు ఏళ్ల తరబడి కనీస సౌకర్యాలు నోచుకోని పాఠశాలలు ఒక్కొక్కటిగా రూపురేఖలు మార్చుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల మనుగడే ప్రశ్నార్థకమైన రోజుల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ చర్యలతో నూతన వైభవాన్ని సంతరించుకొని కార్పొరేట్ పాఠశాలలకు తలదన్నేలా రూపుదిద్దుకున్నాయి. కలలో కూడా ఊహించని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు ఫుల్ అనే బోర్డులు వెలిశాయి.

నేడు కానీ కూటమి అధికారంలోకి రాగానే ఒక్కసారిగా పాఠశాలల అభివృద్ధి ఆగిపోయింది. అప్పటి వరకు జెట్‌స్పీడ్‌తో పరుగులు పెట్టిన పాఠశాలల అభివృద్ధి అర్ధాంతరంగా నిలిచిపోయింది. విద్యాలయాలపై కక్ష కట్టిన కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణాలు నిలిచి మొండి గోడలు దర్శనమిస్తున్నాయి.

- ప్రభుత్వం మారడంతో అర్ధాంతరంగా నిలిచిన పాఠశాల భవన నిర్మాణాలు
- మూడు రోజుల్లో తెరుచుకోనున్న సర్కారు బడులు
- సరస్వతీ నిలయాలపై ఏడాది నుంచి కూటమి సర్కార్ నిర్లక్ష్యం
- సౌకర్యాల లేమితో విద్యార్థులకు తప్పని తిప్పలు


దిరిశవంచ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆగిన భవన నిర్మాణం

కనిగిరిరూరల్: పేద విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు- నేడు పథకం ప్రవేశపెట్టింది. సర్కారు బడులను బహు సుందరంగా తీర్చిదిద్దింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సర్కార్ బడులపై శీతకన్ను వేసింది. గత ప్రభుత్వంలో ప్రారంభించిన ఈ పనులకు నిధుల కేటాయింపు చేయలేదు. దీంతో ఏడాదిగా పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఫలితంగా అనేక చోట్ల మొండి గోడలు.. నిలిచిన గదుల నిర్మాణాలు, జరగని ప్లాసింగ్ పనులు, తుప్పు పడుతున్న పిల్లర్ల, స్లాబుల చువ్వలు.. చెట్ల చదువులు ఇలా.. సరస్వతీ నిలయాలు సమస్యలతో స్వాగతం పలుకేందుకు సిద్ధంగా ఉన్నాయి.

నాడు – నేడుతో మారిన రూపు రేఖలు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో .. నాడు, నేడు పథకం కింద విద్యా వ్యవస్థలో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సీబీఎస్‌ఈ, ఐబీ సిలబస్ ప్రవేశపెట్టారు. అనేక విద్యాభివృద్ధి పథకాలతో అందరి చూపు ఏపి వైపు తిప్పుకునేలా చేశారు.

రూ.కోట్ల ఖర్చుతో పనులు

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొదటి విడతలో నాడు నేడు కింద 161 పాఠశాలలకు గాను రూ.35.40 కోట్లు ఖర్చు చేశారు. రెండో విడత నాడు– నేడు పథకం కింద 127 పాఠశాలలు ఎంపికయ్యాయి. దానికి సంబంధించి గత ప్రభుత్వంలో రూ.55.20 కోట్లు నిధులు మంజూరు కాగా అందులో రూ.29.04 కోట్లు ఖర్చు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో ఒక్క రూపాయి విడుదల చేయలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే అర్ధాంతరంగా నిలిచాయి.

ప్రస్తుతం పరిస్థితి ఇది..

✦ కనిగిరి పట్టణంలోని నాల్గవ వార్డు(ప్రస్తుతం, 8వ వార్డు) ఉర్దూ పాఠశాలలో నాలుగు అదనపు తరగతి గదుల భవన నిర్మాణాలు నిలిచాయి. నాడు–నేడు పథకం కింద నిధులు మంజూరు కాకపోవడంతో విద్యార్థులు ఇరుకు గదుల్లో, నేలపై కూర్చొని అసౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే 3 వార్డులోని ఎంపీయూపీ స్కూల్, దిరిశవంచ జెడ్పీ హెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల, ఎంపీయూపీఎస్ యడవల్లి, చాకిరాల, మాచవరం, వాగుపల్లి పాఠశాలలు కూడా నాడు –నేడు రెండో విడత నిధులు మంజూరు కాగా పనులు నిలిచాయి.

✦హనుమంతునిపాడు మండలంలోని సీతారాంపురు, నందనవనం, లింగం కుంట్ల, మొహ్మదాపురం, నీలకంఠాపురం, చినముప్పళ్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలు, నందనవనం (ఎంపీయూపీఎస్) స్కూల్స్‌లో రెండో విడత నాడు- నేడు నిధులు విడుదల కాక పాఠశాల పనులు అర్ధాంతరంగా నిలిచాయి.

✦ సీఎస్‌పురం మండలంలో నాడు- నేడు రెండో విడత కింద 18 పాఠశాలలకు రూ.8 కోట్లు మంజూరయ్యాయి. ప్రహరీల నిర్మాణం, అదనపు తరగతి గదుల నిర్మాణం పనులు సగం జరిగాయి. ప్రభుత్వ మారిన తర్వాత నిధులు రాకపోవడంతో మిగతా పనులు ఆగిపోయాయి.

✦ పామూరు మండలంలో 25 పాఠశాలలకు రూ.14 కోట్లు మంజూరు కాగా వాటిలో సగానికి పై నిధులు ఖర్చు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు ఇవ్వకపోవడంతో మిగతా పనులు నిలిచాయి.

✦ తూర్పుకట్టకిందపల్లె ఎంపీయూపీ పాఠశాలకు రెండో విడతలో రూ.42 లక్షలు మంజూరయ్యాయి. అదనపు గదులు, మరుగుదొడ్లు, వంటగది పనులు ప్రారంభించారు. రూ.13 లక్షల వరకు ఖర్చు పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు నిలిపి వేయడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచాయి. దీంతో ఈ పాఠశాలకు చెందిన 33 మంది విద్యార్థులు సమీప ఎస్సీకాలనీ ఎంపీపీఎస్‌కు వెళ్తున్నారు. అక్కడ స్థల లేమితో ఇరుకు గదుల్లో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మోపాడులోని పాఠశాల భవన నిర్మాణపనులు నిలిచిపోవడంతో అక్కడ కూడా విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు.

✦పీసీపల్లి మండలంలో నాడు–నేడు పనులు ఎక్కడకక్కడ నిలిచిపోయాయి. కస్తూరిబా పాఠశాలలో అదనపు తరగతులు భవనాలు శ్లాబ్ దశలో, మురుగమ్మి ఉన్నత పాఠశాల పిల్లర్లు బేస్‌మట్టం స్థాయిలో ఆగిపోయాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు కింద ఖర్చు చేసిన వివరాలు

మండలం	ఫేజ్‌లో ఎంపికైన పాఠశాలలు	మంజూరైన నిధులు	ఖర్చు	ఫేజ్–2లో ఎంపికైన పాఠశాలలు	మంజూరైన నిధులు	ఖర్చు చేసిన నిధులు (దాదాపుగా)
కనిగిరి	35	రూ. 8.30కోట్లు	రూ. 8.30కోట్లు (దాదాపుగా)	46	రూ. 21.20 కోట్లు	రూ. 11కోట్లు
పామూరు	28	రూ. 6 కోట్లు	రూ. 6కోట్లు	25	రూ. 14 కోట్లు	రూ. 6.97 కోట్లు
సీఎస్‌పురం	25	రూ. 5.50 కోట్లు	రూ. 5.50 కోట్లు	18	రూ. 8కోట్లు	రూ. 4.07 కోట్లు
హెచ్‌ఎంపాడు	26	రూ 4 కోట్లు	రూ 4కోట్లు	9	రూ. 2 కోట్లు	రూ. 1కోటి
పీసీపల్లి	26	రూ. 6 కోట్లు	రూ. 6కోట్లు	9	రూ. 3కోట్లు	రూ. 2 కోట్లు
వెలిగండ్ల	21	రూ. 5.50కోట్లు	రూ. 5.50కోట్లు	20	రూ. 7కోట్లు	రూ. 6కోట్లు
	161	రూ 35.40 కోట్లు	రూ. 35.40 కోట్లు	127	రూ. 55.20 కోట్లు	రూ. 29.04 కోట్లు


కనిగిరి నాల్గవ వార్డు ఉర్దూ పాఠశాలలో నిలిచిన అదనపు తరగతి గదులు


తూర్పు కట్టకిందపల్లెలో నిర్మాణదశలో పనులు నిలిచిన ఎంపీయూపీ పాఠశాల భవనం


ఆగిన మురుగమ్మి పాఠశాల భవనం.. తుప్పు పడుతున్న చువ్వలు..

జగనన్న పోరుబాటను విజయవంతం చేద్దాం

- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ


మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: పొగాకు రైతులకు అండగా ఈ నెల 11న పొదిలి రానున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఏ ఒక్క రైతు సంతోషంగా లేరన్నారు. పంటలకు గిట్టు బాటుధరలు లేక అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు లేక పొగాకు రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో పొగాకుకు ఊహించని ధరలు రావడంతో రైతులు ఎంతో లాభపడ్డారని గుర్తు చేశారు. పొగాకు రైతులకు అండగా ఉండేందుకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి రూ.118 కోట్లు కేటాయించి కొనుగోలుచేశారని తెలిపారు. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుచేసి రైతులకు మద్దతు ధర కల్పించి ఆదుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. లేకుంటే రైతుల ఆగ్రహానికి కూటమి సర్కార్ గురికాక తప్పదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, మాజీ ఎంపీపీలు గాయం బలరాంరెడ్డి, భువనగిరి వెంకటయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, పాలకొల్లు మల్లికార్జునరెడ్డి, గజ్జల వెంకటరెడ్డి, యక్కంటి శ్రీను, దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, కల్లూరిరామిరెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, జి. ఆదినారాయణరెడ్డి, కటికల వెంకట రత్నం, చాంద్‌బాషా(బుజ్జీ), పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి,ఎస్కే జిలాని బాషా, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: పొగాకు రైతులకు అండగా ఈనెల 11న పొదిలికి రానున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం జగనన్న పర్యటన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్టీ ఉపాధ్యక్షుడు గొల్లపోతు గోవర్ధన్, పాకనాటి రమణారెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యనమల మాధవి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా కిరణ్‌కుమార్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు గాదంశెట్టి గుప్తా, మండల ప్రధాన కార్యదర్శి కొల్లూరి సాయికోటి, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మాదాల శంకర్, షేక్ కరీం, మిడసల అశోక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొన్నలూరు: రైతులకు అండగా ఈ నెల 11న పొదిలి రానున్న మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటను విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పొన్నలూరులో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ క్రమంలో రైతులకు అండగా పొదిలి రానున్న జగనన్న పర్యటనకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి మన్నెం చిన్న వెంకటేశ్వర్లు, గౌడ్ పేరు విజయ్, సిరిగిరి రామకృష్ణారెడ్డి, పచ్చవ వంశీకృష్ణ, కొల్లూరి సాయిరాం పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 11న పొదిలిలో తలపెట్టిన పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులెవ్వరు ఆనందంగా లేరన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, దుగ్గిరెడ్డి జయరెడ్డి, మన్నేపల్లి పెద్దన్న, ముడుమాల నారాయణరెడ్డి, బత్తుల మాల్యాద్రి, పులి రామచంద్రారెడ్డి, బత్తుల దేవరాజు, సిద్దు వెంకటరెడ్డి, యంబటి ప్రవీణ్‌కుమార్, తోట రమేష్, తమ్మిశెట్టి అంకబాబు, సూర్యనారాయణ, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పామూరు: జగనన్న పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పొదిలిలో జగన్‌పోరుబాటకు వెళ్లేందుకు అన్ని పంచాయతీల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. పార్టీ నాయకులు కల్లూరి రామిరెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, శ్రీరాం శ్రీనివాసులు, షేక్.నాయబ్ పాల్గొన్నారు.

మర్రిపూడి: రైతులకు అండగా ఈ నెల 11న పొదిలి రానున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు ఇనుకొల్లు సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నిరసన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కొండపి: పొగాకు రైతులకు బాసటగా నిలిచేందుకు ఈనెల 11న పొదిలి పొగాకు బోర్డుకు రానున్న వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. కొండపిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి ఉన్న సమయంలో మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయించడంతో రైతులకు మేలు చేకూరిందన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం. నారాయణ, నాయకులు వేముల రమేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): పొగాకు రైతులకు అండగా నిలిచేందుకు ఈ నెల 11న పొదిలి రానున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పిన్నిక శ్రీనివాసులు రైతాంగానికి విజ్ఞప్తి చేశారు. జరుగుమల్లి మండలం పంగులూరివారిపాలెంలో సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ చేతగానితనంతో ఒక్కో రైతులకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు నష్టం వస్తుందన్నారు. అనంతరం కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మాజీ మండల అధ్యక్షుడు బత్తిన మనోహర్, వైస్ ఎంపీపీ పులి భిక్షాలు, సర్పంచ్ కె.పున్నారావు, ఉప సర్పంచ దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, కొరకూటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

హనుమంతునిపాడు: ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై ఎం మాధవరావు అన్నారు. స్థానిక సీతారాంపురం, గుడిపాటిపల్లి, కనిగిరి రహదారిలో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

కొండపి: ప్రకృతి వ్యవసాయంలో సాగుచేసిన పంటలకు మంచి డిమాండ్ ఉండి అధిక లాభాలు పొందవచ్చని యూనిట్ ఇన్‌చార్జిలు రంజిత్, మాధవ అన్నారు. మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు విక్రయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలకు ప్రస్తుతం మార్కెట్లో ఎక్కువ డిమాండ్ ఉందన్నారు. ఐసీఆర్పీలు జోత్స్న, గౌతమి, విజయలక్ష్మి, ఏడుకొండలు, తిరుమల, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళలు, రైతులు పాల్గొన్నారు.


ఆహార ఉత్పత్తులను విక్రయిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పొన్నలూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంపీడీఓ డాక్టర్ సుజాత అన్నారు. యోగాంధ్ర–2025 కార్యక్రమంలో భాగంగా సోమవారం పొన్నలూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరి దైనందన జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలన్నారు. ఏపీఓ సుధాకర్ రావు, ఏపీఎం శ్రీనివాసులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పీసీపల్లి: ప్రతి రోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ హనుమంతరావు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ నుంచి వైఎస్ఆర్ సెంటర్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఎంఈఓలు శ్రీనివాసచారి, సంజీవ్, డిప్యూటీ ఎంపీడీఓ రాంప్రసాద్, ఏపీఓ జహంగీర్‌బాష, నాయకులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: యోగాంధ్ర సాధన ప్రతి ఒక్కరి లక్ష్యమని ఎంపీడీఓ ఎం రంగసుబ్బరాయుడు అన్నారు. యోగా శిక్షణ తరగతుల అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓలు ఎస్.రమణయ్య, పెద్దిరాజు, ఎంపీటీసీ ఉడుముల వెంకటసుబ్బయ్య, శిక్షకులు జిలానీ, రమేష్, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పీసీపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

పామూరు: పామూరులో యోగాపై అవగాహన ర్యాలీ సోమవారం స్థానిక ఒకటవ సచివాలయం వద్ద నుంచి పామూరులోని ప్రధాన వీధుల్లో నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు యోగాపై అవగాహన కలిగి, యోగా ఆచరించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. డాక్టర్ గద్దే ఏడుకొండలు, పువ్వాడి వెంకటేశ్వర్లు, జి.అరవిందారెడ్డి, రత్నకుమార్, ఇర్రి కోటిరెడ్డి, అమీర్‌బాబు పాల్గొన్నారు. సీఎస్‌పురంలో ఎంపీడీఓ వాణి, తహసీల్దార్ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో యోగా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సందిరెడ్డి మురళి, రంజిత్, పలువురు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పామూరు: మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశహాలులో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. అన్నిశాఖల అధికారులు సంబంధిత వివరాలతో హాజరు కావాలని కోరారు.

కనులపండువగా గ్రామోత్సవం


హంసవాహనంపై మోహినీ అలంకరణలో వేణుగోపాలస్వామి గ్రామోత్సవం

పామూరు: స్థానిక రుక్మిణి, సత్యభామా సమేత మదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మదన వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తి మోహినీ అలంకరణలో హంసవాహనంపై ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు ఆధ్వర్యంలో ఉభయదాతలకు అర్చకులు నారాయణం సత్యబాబు, గోపిస్వామి ప్రత్యేక పూజలు చేశారు.

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి


యోగాలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

కందుకూరు: ప్రతి ఒక్కరి నిత్య జీవితంలో యోగా భాగం కావాలని సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో యోగా ర్యాలీలు నిర్వహించారు. ఓవీ రోడ్డు, కనిగిరి రోడ్డు, పామూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో యోగా ర్యాలీ నిర్వహించి యోగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ బొమ్మ వద్ద జరిగిన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం యోగా డేను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని తెలిపారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని వివరించారు. సీఐ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అనూష పాల్గొన్నారు.

భూ సేకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఉలవపాడు: ఇండోసోలార్, భారత్ పెట్రోలియం పరిశ్రమలకు సంబంధించి భూ సేకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు కోరారు. పచ్చని పంట పొలాల్లో ఇలాంటి పరిశ్రమలు ఏర్పాటుచేస్తే ప్రజల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చి పంటపొలాలను పారిశ్రామిక వేత్తలకు వేల ఎకరాలు కట్టబెట్టడం ఏంటని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నోటిఫికేషన్‌ను నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.